# సకల సౌకర్యాలతో మినీ స్టేడియం




మినీ స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి(ఫైల్), మినీ స్టేడియంగా మారనున్న హైస్కూల్ క్రీడామైదానం

- **రూ.10 కోట్లతో పనులు ప్రారంభం**
- **దశ మారనున్న హైస్కూల్ గ్రౌండ్**
- **ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి కృషితో నిధులు మంజూరు**

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 4: సకల సౌకర్యాలతో హుజూరాబాద్ మినీస్టేడియం కల త్వరలో కళ్ల ముందు ఆవిష్కరించబోతోంది. ఎట్టకేలకు మినీ స్టేడియం ఏర్పాటుకు అంకురార్పన జరిగింది. రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు కౌశిక్‌రెడ్డి చేసిన విజ్ఞప్తి మేరకు రూ. 10 కోట్లు మంజూరయ్యాయి. కరీంనగర్‌కు చెందిన ఎంఎస్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్ దక్కించుకుంది. ఇప్పటికే అధికారులు పనులకు సంబంధించి డీపీఆర్‌తో పాటు అధునాతన డిజైన్‌ను ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డికి అందజేశారు. కాగా శాసన మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి గత నెల 12న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. 6 నెలల్లో మినీ స్టేడియం పనులు పూర్తి చేయనున్నట్లు సదరు గుత్తేదారు, క్రీడా వర్గాలు తెలిపాయి.

### ఆరు ఎకరాల్లో మినీ స్టేడియం నిర్మాణం

హుజూరాబాద్ పట్టణం క్రీడలు, క్రీడాకారులకు నిలయం. ఇక్కడినుంచి ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటారు. అయితే సరైన క్రీడా సౌకర్యాలు లేకపోవడంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురయ్యేవారు. పలువురు ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు శాసనమండలి సభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మూడు నెలల క్రితం హుజూరాబాద్‌కు వచ్చిన మంత్రి కేటీఆర్‌కు సమస్యను వివరించి రూ.10 కోట్లను మంజూరు చేయించడంలో ఎమ్మెల్సీ సఫలీకృతులయ్యారు. ఆరు ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానాన్ని మినీ స్టేడియంగా నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కౌశిక్‌రెడ్డి ప్రత్యేకంగా తానే దగ్గరుండి తయారు చేయించిన డిజైన్(నమూన)ను ఇటీవల హైస్కూల్ క్రీడా మైదానంలో క్రీడాకారులకు చూపగా ఎంతగానో ఆకట్టుకుంటుంది. కౌశిక్‌రెడ్డి ఇచ్చిన డిజైన్‌ను అనుసరించి గుత్తేదారు పనులను కూడా ప్రారంభించారు. దీంతో 3,845 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూ .2 కోట్ల 85 లక్షలతో హాకీ కోర్టు, 5,678 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూ. 3 కోట్ల 58 లక్షలతో ఫుట్‌బాల్ కోర్టు, 670 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూ .28 లక్షలతో టెన్నీస్‌కోర్టు, 605 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూ .29 లక్షలతో బాస్కెట్ బాల్ కోర్టు, 2,903 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూ.కోటి పది లక్షలతో వాకింగ్ ట్రాక్, 400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూ. 27 లక్షలతో క్రికెట్ పిచ్, రూ.38 లక్షలతో కబడ్డీ, ఖోఖో కోర్టులను నిర్మించనున్నారు. మరో రూ.కోటి 25లక్షలతో ఆఫీస్ బిల్డింగ్, సెక్యూర్టీ రూమ్, సీటింగ్ గ్యాలరీ, 2.4 మీటర్ వాకింగ్ ట్రాక్, క్లబ్, ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్ రూమ్, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ జీ-ప్లస్ వన్, రెండు టాయిలెట్స్, ఇతరత్రా పనులు చేపట్టనున్నారు. అలాగే మినీ స్టేడియం చుట్టూ హరితహారంలో భాగంగా పచ్చటి పూల, పండ్ల చెట్లను పెంచనున్నారు.

### ఎమ్మెల్సీ చొరవతోనే చకచకా పనులు



ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మినీ స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కాగా బుధవారం ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి ప్రారంభించారు. దీంతో ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న ప్రజల చిరకాల వాంఛ అతి త్వరలోనే నెరవేరుతుంది. సకల సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయిలో మినీ స్టేడియాన్ని నిర్మించనున్నారు. అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. క్రీడలు, క్రీడాకారుల పట్ల ఆయనకు ఉన్న ఆదరాభిమానాలకు మినీ స్టేడియం ఏర్పాటే నిదర్శనం.

**- గందె రాధిక, పురపాలక సంఘం చైర్‌పర్సన్**

### మినీ స్టేడియం నమూనా బాగుంది



మినీ స్టేడియానికి ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి శంకుస్థాపన చేయడంతో క్రీడాకారులు, వాకర్స్, పట్టణ ప్రజలు ఎంతో సంబర పడుతున్నారు. గతంలో ఎంతోమంది పాలకులు, ప్రభుత్వాలు మారినా.. ఏనాడు క్రీడా మైదానాన్ని పట్టించుకున్న నాయకుడు లేడు. కానీ నేడు సీఎం కేసీఆర్ దృఢసంకల్పం, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి క్రీడాభిమానంతో మినీ స్టేడియం పనులు చకాచకా జరుగుతున్నాయి. పట్టణ క్రీడాకారులు, వాకర్స్, ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం మినీ స్టేడియంలోనే గడిపేలా అన్ని విధాలుగా సకల సౌకర్యాలతో మినీ స్టేడియాన్ని నిర్మిస్తుండడం సంతోషంగా ఉంది.

**-కొలిపాక శ్రీనివాస్, హాకీ క్లబ్ అధ్యక్షుడు**

### అన్ని వర్గాలకు ఉపయోగకరంగా నిర్మాణం



మినీ స్టేడియాన్ని సకల సౌకర్యాలతో ఏర్పాటు చేస్తుండడం అన్ని వర్గాలకు ఉపయోగకరంగా ఉంది. క్రీడాకారులతో పాటు వాకర్స్ కోసం ప్రత్యేకంగా సింథటిక్ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం, చుట్టూ ఆహ్లాదకరంగా పండ్ల, పూల మొక్కలు పెంచేలా ప్రణాళికతో తీర్చిదిద్దడం సంతోషం కలిగిస్తుంది. ఇక నుంచి ఉరుములు ఉరిమిన, పిడుగులు పడిన క్రీడాకారులకు గానీ, వాకర్స్‌కు గానీ ఎలాంటి ఇబ్బంది తలెత్తదు. అద్భుతమైన మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి కేటీఆర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డికి ప్రజలు ఎల్లకాలం రుణపడి ఉంటారు.

**-వేముల గోవర్దన్, వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు**

## డబుల్ రోడ్డుపై గ్రామ సభ

గన్నేరువరం రూరల్, అక్టోబర్ 4:మండల కేంద్రంలో చేపట్టే డబుల్ రోడ్డు నిర్మాణంపై బుధవారం సర్పంచ్ పుల్లల లక్ష్మి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ రహదారి నిర్మాణంలో గృహాలు కోల్పోయే వారికి గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని, డబుల్ రహదారి వెడల్పు 42 ఫీట్లు మించకుండా నిర్మాణం చేపట్టాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు బూర వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పుష్పలత, వార్డు సభ్యులు, నాయకులు పుల్లెల లక్ష్మణ్, న్యాత సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామ సభలో పాల్గొన్న గ్రామస్తులు

## చెర్లభూత్కూర్‌లో గొర్రెల యూనిట్లు పంపిణీ



గొర్ల యూనిట్స్ పంపిణీ చేస్తున్న మండల పశు వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 4: చెర్లభూత్కూర్‌లో బుధవారం గొర్రెల యూనిట్లను బొమ్మకల్ పశువైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడుత గొర్రెల పంపిణీలో భాగంగా చెర్లభూత్కూర్ నుంచి 31 మంది గొర్రెల కాపరులు డీడీలు చెల్లించగా, ఇప్పటి వరకు 18 మందికి గొర్రెలను అందజేశారనానరు. గొర్రెల యూనిట్ విలువ రూ 1,75,000 కాగా లబ్ధిదారుడి వాటా రూ. 43,750 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. మిగితా రూ. 1,31,250 ప్రభుత్వం చెల్లిస్తుందని, ఒక్కో యూనిట్‌లో 20 ఆడ గొర్రెలు, ఒక పోట్టేలుంటుందని తెలిపారు. గ్రామంలోని పెద్ది ఓదెలు, రవి, సంపత్, చిట్కూరి శేఖర్, రాములు తదితరులకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేశామన్నారు. మరో రెండు రోజుల్లో మరో ఆరుగురికి యూనిట్లు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, వైద్య సిబ్బంది సమ్మయ్య, గొర్రెల కాపలాదారుల సంఘం అధ్యక్షుడు చిట్కూరి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అల్ఫోర్స్ ఫ్రెషర్స్ డే

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 4 : జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల కరెస్పాండెంట్ రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులు ఆత్మన్యూనతా భావాన్ని తగ్గించుకోవాలని, గమ్యాన్ని నిర్దేశించుకున్నప్పుడు దానికి తగిన సమయాన్ని కేటాయించుకొనేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, డిగ్రీ విద్యకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్, కాంపిటీటివ్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థినులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## 'మధుపాళీ వ్యాసతోరణం' పుస్తకావిష్కరణ

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 4 : ఎస్సారార్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి రచించిన 'మధుపాళీ' వ్యాసతోరణం పుస్తకాన్ని మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మాతృభాషలో పాఠశాల విద్యనభ్యసిస్తే విద్యార్థుల మేదస్సుకు గట్టి పునాదులు ఏర్పడతాయని చెప్పారు. మన తెలంగాణ ముద్దుబిడ్డలు అన్ని రంగాల్లో తమదైన ముద్రను వేయడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమానికి దాస్యం సేనాధిపతి అధ్యక్షత వహించి మాట్లాడుతూ, తెలంగాణ సమాజంలో కళలు, సాహిత్యానికి పెద్దపీట వేస్తున్న సాహితీవేత్తల కృషిని ప్రస్తుతించారు. కరీంనగరం అక్షర యజ్ఞానికి వేదికవడం సంతోషదాయకమన్నారు. రచయిత బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, విశ్రాంత జీవితంలో సాహిత్య సేద్యం ఎంతో తృప్తినిస్తున్నదన్నారు. విశిష్ట అతిథి, నేటి నిజం సంపాదకుడు బైసా దేవదాసు మాట్లాడుతూ, కొత్తగా కవిత్వం రాస్తున్న సాహితీ వేత్తలను నేటి నిజం పత్రిక ద్వారా ప్రోత్సహిస్తూ వేలాది కవులకు ఆత్మవిశ్వాసాన్ని నింపి నేడు ఉత్తమ సాహితీవేత్తలుగా మార్చడం ఆనందదాయకమన్నారు. గౌరవ అతిథులుగా శాతవాహన టైమ్స్ సంపాదకుడు అనుముల దయాకర్, కరీంనగర్ ఫిలిమ్ సొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 8న జిల్లాస్థాయి స్పోర్ట్స్ చాంపియన్‌షిప్

కొత్తపల్లి, అక్టోబర్ 4 : కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ యోగా అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈ నెల 8న కరీంనగర్ జిల్లాస్థాయి యోగాసనా స్పోర్ట్స్ పోటీలను స్థానిక అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ రవీందర్‌సింగ్, నాగిరెడ్డి సిధారెడ్డి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను సబ్ జూనియర్ విభాగంలో 8 నుంచి 10 పది, 10 నుంచి 12, 12 నుంచి 14 జూనియర్స్ విభాగంలో 14 నుంచి 16, 16 నుంచి 18, సీనియర్స్ విభాగంలో 18 నుంచి 21, 21 నుంచి 25, 25 నుంచి 30, 30 నుంచి 35, 35 నుంచి 45, 45 పై బడిన స్త్రీ పురుషులకు, ప్రొఫెషనల్ విభాగంలో అదే మాదిరిగా ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగంలోనూ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 8న ఉదయం తొమ్మిది గంటలకు అంబేద్కర్ స్టేడియంలో ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు యోగా కోచ్ వీ కిష్టయ్య సెల్ నంబర్ 8985275068, రామకృష్ణ 9177948868లో సంప్రదించాలన్నారు.

## సంయుక్త కార్యదర్శిగా సంపత్

హుజూరాబాద్‌టౌన్,అక్టోబర్4: తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బోర్నపల్లికి చెందిన గంట సంపత్ ముదిరాజ్‌ని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ముదిరాజ్ కులాన్ని, జాతిని ఐక్యం చేస్తూ సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తానని సంపత్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన ముదిరాజ్ పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

శంకరపట్నం, అక్టోబర్ 4: అంబాల్‌పూర్‌కు ఓ యువకుడు బైక్ అదుపు తప్పి కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. అంబాల్‌పూర్‌కు చెందిన పెద్దాపురం అరుణ్ కుమార్ బుధవారం వ్యక్తిగత పనిపై కరీంనగర్ వెళ్లి అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి వస్తున్నాడు. రాత్రి 11.30 గంటల సమయంలో తాడికల్ శివారులోని పెద్దమ్మతల్లి గుడి సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి గుంతలో పడింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడ్డ అరుణ్‌కుమార్‌కు తలపగిలి తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికుల ద్వారా సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ దవాఖానకు తరలించారు. వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు.

## గ్రామాల్లో ఈజీఎస్ పనులు

చిగురుమామిడి, అక్టోబర్ 4: చిగురుమామిడిలోని పెద్దగుట్ట వద్ద అమృత్ సరోవర్‌లో భాగంగా ఈజీఎస్ పనులు చేపట్టారు. రేకొండ, ఉల్లంపల్లి, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లె, సుందరగిరి, బొమ్మనపల్లి, రామంచ గ్రామాల్లో మొక్కల ప్లాంటేషన్, ఫీడర్ చానల్ పనులు, పామ్ పౌండ్ రోడ్డు పనులను కూలీలు చేపట్టగా ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు పరిశీలించారు.